# భగవత్సృష్టియందు సర్వము పవిత్రమైనదే!

ఒకరి మేలునుజూచి ఓర్వలేకున్నావు
　　ఈ అసూయాబుద్ధి నీకేలనయ్య?
ఒకరి పదవిజూసి ఓర్వలేకున్నావు
　　ఈ ఈర్ష్యబుద్ధి నీకేలనయ్య?
ఒకరి సంపదజూచి ఓర్వలేకున్నావు
　　ఈ నీచబుద్ధి నీకేలనయ్య?
ఒకరి శక్తిజూచి ఓర్వలేకున్నావు
　　ఈ హీనబుద్ధి నీకేలనయ్య?

ప్రేమస్వరూపులారా!

చరాచర ప్రపంచమంతయు సుఖదుఃఖసమ్మిళితమైన స్వరూపముతో పరస్పర విరుద్ధముగా నున్నది. సుఖములేని దుఃఖము, దుఃఖములేని సుఖము మానవుడు అనుభవించలేడు. 'నసుఖాత్ లభ్యతే సుఖం'. సుఖము లేకుండా దుఃఖము మనకు ప్రాపించదు. ఆకలి లేకుండా అన్నము గిట్టదు. చీకటి లేక దీపమునకు వెలుగు కలగదు. అదే విధముగా ప్రతి మానవుడు సుఖదుఃఖ సమ్మిళితమైన జీవితము గడుపుతూ వస్తున్నాడు. అయితే ఈ రెండింటి ఏకత్వము ఒక్కటే!

**అనేకత్వములోని ఏకత్వమును గుర్తించే మానవులు చాలా తక్కువగా ఉంటున్నారు**

మృత్పిండమేకం బహుభాండరూపం
సువర్ణమేకం బహుభూషణాని
గోక్షీరమేకం బహుధేనుజాతా
ఏకం పరాత్మా బహుదేహవర్తి

srisathyasaivachanamrutam

మట్టి ఒక్కటే, కానీ మట్టితో చేసిన రూపములు అనేకము. నామములు అనేకము. సువర్ణము ఏకమే, కానీ ఆభరణములయొక్క రూపనామములు భిన్నముగా కనిపిస్తున్నాయి. గోవుల రూపములు వేరువేరే, కానీ పాలరూపము ఒక్కటే! అదే విధముగా భిన్నభిన్నరూపనామములతో కనిపించే మానవ జీవితమందు దివ్యత్వము ఒక్కటిగానే ఉంటుంది. ఇట్టి రహస్యము గుర్తించుకోటమే మానవుని ప్రధాన కర్తవ్యము. అదియే జీవితముయొక్క ఆశయము. అనేకత్వములోని ఏకత్వము చూచే మానవులు చాలా తక్కువగా ఉన్నారు. ఏకత్వమును అనేకత్వంగా భావించి, విభజించి గుర్తించే మేధావులు దినదినాభివృద్ధి నొందుతున్నారు. కానీ, ఈనాటి పరిస్థితులప్రభావమునకు అనేకత్వములోని ఏకత్వమే సరైన ఆధారము. మన సత్యమును మనం గుర్తిస్తే అన్నింటిని గుర్తించిన వారమవుతాము. అట్టి సత్యాన్ని గుర్తించటానికి మనం ప్రయత్నించాలి. కానీ ఈనాటి మానవుడు అట్టి సర్వాధారమైన సత్యాన్ని విస్మరిస్తున్నాడు. అనేకత్వములో గోచరించే భిన్నత్వమునే విశ్వసిస్తున్నారు. ఇదే మానవుడు దారి తప్పటం. ఇదే మానవుని వికృతికి మూలకారణము.

**ఎక్కడ చూచినా స్వార్థ స్వప్రయోజనములే తాండవమాడుచున్నవి**

నిత్యజీవితములో ప్రతి మానవుడు నిర్విరామ కృషిచే, నిరంతర తాపత్రయములచే, అంతులేని ఆశలచే, అర్థము కాని ఆవేదనలచే అప్రాప్యరూప ప్రాప్తికై ప్రాకులాడుతూ అశాంతికి గురౌతున్నాడు. ఈ దృశ్యగోచరమైన ప్రపంచమందు అనేక విధములైన రూపనామములు మనం చూస్తున్నాము. ఈ అన్ని రూపనామములుకూడా 'ఇది' అనే పదమునందు ఇమిడి ఉంటున్నవి. ఇదియే వేదాంతముయొక్క, ఉపనిషత్తులయొక్క నిజసారము. మనకు ఆనందమైన గుణము ఏమిటి? ఈనాడు విజయదశమి ఆనందమైన దినమని భావిస్తున్నాము. ఇదికాదు, ఆనందము.

**సద్భక్తులందరు భగవంతుడాయంచు**
**చెవులకింపుగ నుతి చేయుదినము**
**బీదలవెతలన్ని ప్రీతితో తొలగించి**

అన్నదమ్ములమాడ్కి నున్న దినము
దైవచింతన చేయు దాసబృందములకు
ప్రీతి మృష్టాన్నము పెట్టుదినము
మహనీయులెవరైన మనకడకేతెంచి
చెలిమిభగవత్కథలు చెప్పుదినము
అట్టి దినమును దినముగా అనుభవించు
తక్కినవన్నియు తద్దినములే.

ఇట్టి గుణములు గుర్తించి వర్తించే మానవులు ఒక్కడైనా కనిపించటంలేదు. ఈ విశాలమైన జగత్తునందు ఎక్కడ చూచినా స్వార్థము స్వప్రయోజనమే తాండవ మాడుతున్నది. నిస్వార్థమైన సేవ, విశాలమైన భావము, నిర్మలమైన ప్రేమ ఎక్కడా కనిపించటంలేదు. కనుక, సాయి సంస్థలలో పనిచేసే ప్రతివ్యక్తికి చంద్రునివంటి చూపు, వెన్నెలవంటి హృదయము, తేనెవంటి పలుకు అత్యవసరము. మనచూపు చల్లగా ఆనందమునిచ్చేదిగా ఉండాలి. మన హృదయమా! మధురమైనదిగా ఉండాలి. సున్నితమైనదిగా ఉండాలి. పరులను నొప్పించేదిగా ఉండకూడదు. మన చేతలు ఎట్లాంటివిగా ఉండాలి? ప్రతి పనియందు దివ్యమైన, భవ్యమైన, నవ్యమైన కీర్తిని సాధించేవిగా ఉండాలి. ఈ కలియుగమందు హృదయము పవిత్రమైనదిగను, మాటలు సత్యమైనవిగను, చేతలు పరోపకారసంబంధమైనవిగను ఉండినప్పుడే త్రికరణశుద్ధి అని చెప్పబడుతుంది.

## దేనిని నీవు ఆశిస్తున్నావో, ప్రేమిస్తున్నావో దానినే నిరంతరం స్మరించు

ఈనాటి మానవుడు ఇన్ని దుఃఖములకు, కష్టములకు, నష్టములకు గురికావటానికి కారణము ఏమిటని ప్రతి వ్యక్తి విచారించక తప్పదు. దీనికి ఒక్కటే కారణము. మనము దేనిని వదిలించుకోవాలని చూస్తున్నామో దాని విషయము చింతించకుండా చూచుకోవాలి. ఈ చెడుపు నాలో ప్రవేశించకూడదు అని నీవు సంకల్పించుకుంటున్నావు. అలాంటి సత్యసంకల్పము సంకల్పించుకున్న వాడవు, ఈ చెడుపునే నీవు యోచించకూడదు. చెడుపు నాలో ప్రవేశించకూడదని ఆశిస్తున్నావు గానీ ఆ చెడ్డనే నిరంతరము నీవు స్మరిస్తున్నావు.

srisathyasaivacharamrutam

కనుక, చెడ్డకు మరింత బలము అధికమవుతున్నాది. ఈ చింతయే ఆ చెడ్డకు మంచి ఆహారముగా తయారౌతున్నది. దేనిని నీవు ఆశిస్తున్నావో దేనిని నీవు ప్రేమిస్తున్నావో దానిని నీవు నిరంతరము స్మరిస్తూరా. దైవము కావాలని ఆశిస్తున్నావు. దైవాన్నే ప్రేమిస్తున్నావు. అట్టి దైవచింతనే నీవు చేయి. అప్పుడే నీ చింతనకు మంచిబలము ఏర్పడుతుంది. ఒక చిన్న ఉదాహరణము. నాకు కలలో పంది రాకూడదు. పంది రాకూడదని సంకల్పించుకున్నప్పుడు అసలు పందినే నీవు యోచించకూడదు. అట్లుకాకుండా 'నాకు కలలో పంది రాకూడదు'. అని అనుకుంటే పందే కలలో వస్తుంది. ఇష్టపడని దానిని ఎందుకు స్మరించటము? నాకు భగవంతుడు కలలో రావాలి అని నీవు ఆశించిననాడు 'భగవంతుడు రావాలి' అని చింతించు. నీ అదృష్టమువలన భగవంతుడు వస్తే రావచ్చును, లేకపోతే లేకుండా పోవచ్చును. అంతేగానీ చెడ్డమాత్రం నీకు రాదు.

## దృష్టిని పవిత్రముగా మార్చుకున్నప్పుడు సృష్టి పవిత్రముగా కనిపిస్తుంది

భగవత్ సృష్టియందు సర్వము పవిత్రమైనదే! ఏదికూడా చెడ్డది జగత్తులోలేదు. కానీ మానవుని దృష్టిలో ఉంటున్నది. దృష్టిని పవిత్రముగా మార్చుకున్నప్పుడు సృష్టి పవిత్రముగా కనిపిస్తుంది. కనుక భగవత్ సృష్టిని విమర్శించుటకు ఏమాత్రము అధికారము లేదు. భగవత్సంకల్పము పరిశుద్ధమైనది, పవిత్రమైనది. అట్టి పరిశుద్ధము, పవిత్రమైన భగవత్సంకల్పములు ఏరీతిగా ప్రాప్తిస్తాయి? ప్రాప్తించుటకు వీలేలేదు. కనుకనే సంకల్పములు పరిశుద్ధమైనవిగను, పవిత్రమైనవిగను, మాలిన్య రహితమైనవిగను ఉంటుండాలి. అప్పుడే మానవత్వము దివ్యత్వమును అందుకోగలదు. ఈ దివ్యత్వము సాధించనిది లోకములో లేదు. దేనినైనా సాధించగలదు. సర్వమును భగవంతుడు అన్ని విధముల రక్షిస్తూ ఉంటాడు. పురందర దాసు చెప్పాడు.

**బెట్టదా భువి ఎల్ల........**

కొండపైన రాతిపైన ఒక చెట్టు మొలిచింది. దానికి కట్టకట్టి ఎరువు వేసి నీరు పోసిన వారెవరు? అంతా భగవంతుడే! రాతిపైనే చెట్టును పుట్టించి రాతిపైనే పెంచి మహావృక్షంగా చేశాడు. భగవంతుడు ఎలాంటి గొప్ప పెయింటరు! నెమలిని అనేక రీతులుగా పెయింటు

sri sathyasai vachanamrutam

చేయవచ్చు. కానీ భగవంతుడు సృష్టించిన original paint ఎవరూ చేయలేరు. అన్నీకూడ భగవంతుని సంకల్పముచేత చిత్రవిచిత్రముగా ఉంటాయి. 'చిత్రంబులు త్రైలోక్య పవిత్రంబులు..' విష్ణుదేవుని చరిత్రలు చాలా పవిత్రమైనవి. ఇట్టి పవిత్రమైన చరిత్రలు గుర్తించుటకు మనము ప్రయత్నించక అపవిత్రమైన చరిత్రలనే నిరంతరము స్మరిస్తున్నాము. దీనికి మూలకారణము ఏమిటి? భగవంతునిపైన ఉండవలసిన ప్రేమ మనలో లేకపోవటమే మూలకారణము.

**ప్రేమయే భగవత్స్వరూపము**

ప్రతి మానవునియందు పవిత్రమైన ప్రేమ పెంపొందింపచేసుకోవాలి. ప్రేమయే భగవత్స్వరూపము. ప్రేమయే పరంజ్యోతి. పరంజ్యోతియొక్క తత్త్వమే మానవత్వము. కనుక, ప్రేమలేని మరుభూమిగా మన హృదయమును తయారుచేసుకోరాదు. ఆనాటి గోపికలు ప్రేమమయమైన హృదయము కావాలని ప్రార్థిస్తూ వచ్చారు.

**ప్రేమరహిత మరుభూములలో**
**ప్రేమాంకురములు పెంపొంద**
**ప్రేమావేశముతో ప్రేమసుధావర్షము**
**వర్షింపగ ప్రేమనదులు ప్రవహింపగ**
**మురళిగానముసేయగదే కృష్ణా గానము సేయగదే**

మానవుడు చేసే సర్వపనులయందు, సర్వసంకల్పములందు సర్వకార్యములందు ప్రేమనే ప్రధానసూత్రముగా పెట్టుకోవాలి. ఈనాటి ప్రేమ కేవలం స్వార్థమైన ప్రేమగా రూపొందుతున్నది. కించిత్తైనా పరార్థమైన ప్రేమ గుర్తించటానికి వీలు పడటం లేదు. సర్వము ప్రేమమయమే! జగమంతా ప్రేమమయమే! ప్రేమలేని మానవుడు లేడు. కానీ, ఆ పవిత్రమైన ప్రేమను భిన్న మార్గములో ప్రవేశపెట్టి అపవిత్రముగావించి అశాంతికి గురౌతున్నారు. కనుక, ఈ ప్రేమను సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టాలి.

**మానవుడు భగవంతుని ఆశించినప్పుడు నిస్వార్థ, నిర్మలప్రేమను అభివృద్ధిగావించుకోవాలి**

ఈ ప్రేమకు, భగవంతునికి మాత్రమే సన్నిహితసంబంధము. లోకసంబంధమైన

srisathyasaivachanamrutam

వస్తువులందుగానీ, వ్యక్తులందుగానీ అవి అనురాగములేగానీ ప్రేమకాదు. ప్రాకృతమైన సంబంధభాంధవ్యములే! ప్రవృత్తియొక్క లక్షణములే! కానీ, నివృత్తియందే ఉంది ఆనందము. ఎంతవరకు మన కోరికలు అదుపులో నుంచుకొందుమో అంత ఆనందము మనము పెంచుకున్నవారమవుతాము. మానవుడు భగవంతుని ఆశించినప్పుడు నిర్మలమైన, నిశ్చలమైన, నిస్వార్థమైన ప్రేమను మనము అభివృద్ధి గావించుకోవాలి. నిద్రావస్థయందు ఈ ప్రకృతి దృశ్యమంతాకూడను సహజంగా అదృశ్యమైపోతున్నాది. అప్రయత్నముగా ప్రకృతి మనకు శూన్యమైపోతున్నది. కానీ, ప్రయత్నపూర్వకంగా మనస్సును మనం శూన్యం గావించుకోవాలి. మనసు తత్వాన్ని మనము మరచిపోవాలి. మనసుకు ఎప్పుడు బలము ఏర్పడుతున్నాది? సంకల్పవికల్పములతో దీనికి బలము ఏర్పడుతున్నది. ఎందుకు ఈ సంకల్పవికల్పాలు? జరగవలసింది జరుగుతుంది. ఏమాత్రము విచారించి ప్రయోజనములేదు.

**పోకన్మానదు దేహమేవిధమునన్ పోషించి రక్షించినన్**
**రాకన్మానవు హానివృద్ధులు మహారణ్యమునన్ దాగినన్**

జరగవలసినది జరుగుతుంది. కానీ నిత్యమైన భావములో సత్యమైన దైవత్వమును మనము పూర్తిగా విశ్వసించాలి. భగవంతుడు పూర్ణుడు. అట్టి పూర్ణ స్వరూపమైన భగవంతుని పొందుటకు మీరుకూడా పూర్ణస్వరూపులు కావాలి.

**మానవత్వములో దివ్యత్వమును నిరూపించాలి**

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే**

అదీ పూర్ణమే, యిదీ పూర్ణమే. ఈ రెండు పూర్ణత్వముల ఏకత్వమే మన జీవితము. జీవితమంటే ఏమిటి? ఏ మానవునికి అర్థము కావటంలేదు. ఆహార, నిద్ర, భయ మైధునాదులతో జీవితమును గడపటమే ఒక జీవితము అనుకుంటారు. కాదు కాదు. మానవత్వములోని దివ్యత్వమును నిరూపించాలి. పశుత్వమునుండి మానవత్వము వచ్చింది. మానవత్వమునుండి దైవత్వమునకు చేరాలి. 'జంతూనాం నరజన్మ దుర్లభం'.



sri sathyasaivacharamrutam

చేరవలసిన గమ్యము చేరక, చేయవలసిన ప్రయత్నములు చేయక, దైవము చిక్కాలంటే ఏ విధంగా చిక్కుతుంది? కాలు గడపదాటకూడదు, కాసు ఖర్చు కాకూడదు, కైవల్యం వచ్చి వళ్లో పడాలి. ఇదీ కలియుగముయొక్క ప్రభావము. మానవుడు ఏమాత్రము శ్రమించి పని చేయటంలేదు. మనకు కర్మాధికారమే ఉన్నది. ఎందుచేత? 'కర్మానుబంధీని మనుష్యలోకే'. 'శరీరమాద్యం ఖలు ధర్మసాధకం' మనం పనులు చేయాలి. కానీ, మనం పనులు చేయటానికి ఏమాత్రం ముందంజ వేయటంలేదు. ఇక ఫలితము ఏరీతిగా వస్తుంది?

**పుణ్యస్య ఫలమిచ్ఛంతి పుణ్యం నేచ్ఛంతి మానవాః**
**న పాప ఫలమిచ్ఛంతి పాపం కుర్వంతి యత్నతః.**

పుణ్యము కావాలి, కావాలి, అని ఆశిస్తున్నాము. కానీ పుణ్యకర్మలు చేస్తున్నామా? పుణ్యకర్మలు చేయక పుణ్యఫలము ఏరీతిగా వస్తుంది? పాపఫలము వద్దంటున్నాము. కానీ పాపకార్యము చేయకుండా ఉంటున్నామా? పాపకార్యములకు ముందంజ వేస్తున్నావు. ఏది వద్దు అనుకుంటున్నావో దానిని చేయకుండా ఉంటుండాలి.

**మొట్టమొదట 'నేను మృగము కాదు, మానవుడను' అనే విశ్వాసమును పెంచుకోవాలి**

మానవత్వములో ఈనాడు చంచలత్వము మితి మీరిపోయింది. ఇది సరియైనది కాదు. ఇది మృగలక్షణమేగానీ మానవలక్షణము కాదు. సత్యము, ప్రేమ, సహనం, సానుభూతి, త్యాగము యివి మానవతాగుణములు. కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము, ఈర్ష్య యివన్నీ మృగలక్షణములు. మొట్టమొదట 'నేను మృగము కాదు, మానవుడను', అనే విశ్వాసమును పెంచుకోవాలి. ఏ పూజలు చేయకపోయినా, ఏ వ్రతములు ఆచరించకపోయినా, ఏ దర్శనములు చేయకపోయినా హృదయములో పవిత్రమైన భావములు పెట్టుకుంటే అదే ఎంతో గొప్ప. చేతనైనంతవరకు సహాయము చేయి. అదే చాలు. ఇదే జపము, ఇదే తపము, ఇదే సర్వము. పవిత్రమైన, పరోపకారసంబంధమైన పనులలో పాల్గొనక 'రాం', 'రాం' అని జపమాల తిప్పుతే కాలము వ్యర్థము చేసినవారమే అవుతాము. రాములు చేసిన ఘనకార్యము ఏమిటి? సత్యవాక్పరిపాలన. సత్యమును పాటించటమే రాముని ప్రధానలక్ష్యము. పితృవాక్య

sri sathyasai vahini amrutam

పరిపాలన రాముని ప్రధాన లక్ష్యము. ఎంతమంది ఈ విధంగా చేస్తున్నారు, ఈనాడు? తల్లితండ్రుల ఆజ్ఞను ఎంతమంది నడుచుకుంటున్నారు? ఎంతమంది సత్యమును పలుకుతున్నారు? రాముడు సత్యమునకై సర్వము త్యాగము చేశాడు. రాజ్యము త్యజించాడు, భయంకరమైన అరణ్యములో కాలము గడిపాడు. ఎట్లా గడిపాడు? ఆనందముగా గడిపాడు. సత్యమును పరిపాలించటమునందే ఆనందము అనుభవించాడు.

యీనాడు మనం రామభక్తులము అనుకుంటున్నాము. కాని, రాముడు ఏది త్యజించాడో అవన్నీ మనం చేస్తున్నాము. రాముడు చేసిన పని మనం చేయటంలేదు. రాములు పితృవాక్య పరిపాలనకొరకు సర్వస్వము త్యాగము చేశాడు. అతని మార్గములు మూడు ప్రధానమైనవి.

**హస్తస్య భూషణం దానం సత్యం కంఠస్య భూషణం**<br>
**శ్రోత్రంచ భూషణం శాస్త్రం...**

ఇంతకంటె మించిన అలంకారములు మనకు ఏమిటి? మన కంఠమునకు సత్యమే భూషణము. మన హస్తమునకు త్యాగమే అలంకారము. మన శ్రోత్రములకు పవిత్రమైన శ్రవణమే అలంకారము. ఇంతకంటే మానవునకు అలంకారములు లేవు. ఇదే శాశ్వతమైనది. సత్యమైనది, నిత్యమైనది. మానవత్వమును తరింప చేసేది. దైవాన్ని వరింప చేసేవి. ఇలాంటి నిత్యసత్యమైన భావములు మానవుడు విస్మరించాడు, ఈనాడు.

**ప్రాచీనకాలమునుండి భారతదేశము ఆధ్యాత్మికతత్త్వముచేత పోషింపబడుతూ వచ్చింది**

ప్రతి మానవుడు కష్టపడి పని చేయాలి. ఈనాడు భారతదేశములో లేని సౌకర్యములు ఏ దేశములోను లేవు. విశాలమైన భూమి ఉంటున్నాది. నిరంతరము ప్రవహించే నదులుంటున్నాయి. ఆకలిదప్పులను తీర్చే గొప్ప సంపద ఉంటున్నది. ఇన్ని ఉంటుండి, ప్రాచీనకాలమందు అన్నపూర్ణగా పేరొందిన భారతదేశములో నేడు అన్నమో రామచంద్రా అనే రోదన వినవలసి వస్తోంది. కారణం యేమిటి? మనం నడుమువంచి పని చేయటంలేదు. కావలసినంత భూమి ఉంటున్నది. కృషి చేయి. ఇదే ఋషితత్త్వాన్ని పోషిస్తుంది. పవిత్రమైన సమాజ సంక్షేమానికి తగిన కృషి మనం చేయాలి. ఎవరూ

srisathyasai vachanamrutam

చేయటంలేదు. కావాలి, ధనము ధనము. ఉన్న భూములు అమ్ముకొని పట్టణములలో చేరిపోతున్నారు చాలామంది. ఈనాడు పల్లెలలోనే అంతో యింతో భారతీయ సంస్కృతి మిగిలి ఉంటున్నాది. ఆ సంస్కృతిని పోషించే మహనీయులు నూటికి ఒక్కరో కోటికి ఒక్కరో కనిపిస్తారు. ఒక్కొక్క ప్రదేశమందు ఒక్కొక్క సాంద్రాయమును పోషిస్తూ వచ్చారు. కూచిపూడి మీకు తెలుసు. దాని సాంప్రదాయము ఇప్పటికి కూచిపూడి ప్రజలు పాటిస్తున్నారు. వారు ఎంత సంపద ఉండినా, ఎన్ని సుఖసంతోషములుండినా సాంప్రదాయము మాత్రం వదలటంలేదు. అది మానవత్వ లక్షణము. ప్రాచీనకాలమునుండి భారతదేశము ఆధ్యాత్మికతత్త్వముచేత పోషింపబడుతూ వచ్చింది. నాటిమొదలు నేటివరకు 'లోకాస్సమస్తా సుఖినోభవంతు' అని హైందవసాంప్రదాయమును చాటుతూ వచ్చింది. ఇలాంటి పరిస్థితియందు విదేశ సంస్కృతి, సాంప్రదాయములచేత మానవత్వము పూర్తిగా పోతూ వస్తున్నది. నీయొక్క సాంప్రదాయము నీవు ఎందుకు కాపాడుకోకూడదు? నీ సంస్కృతిని నీవు ఎందుకు పోషించుకోకూడదు? సంస్కృతి అంటే ఏమిటో తెలియని పరిస్థితిలో ఉంటున్నారు, ఈనాడు భారతీయులు.

**భారతీయ సంస్కృతిని చాటలేనివాడు బ్రతికిన పీనుగుతో సమానమే!**

ఎవరు భారతీయుడు? కేవలం భారతదేశములో పుట్టినవాడు మాత్రమే కాదు. 'సత్యంవద, ధర్మంచర' ఈ రెండింటిని ఎవరు పాటిస్తున్నారో వారంతా భారతీయులే! భారతదేశములో పుట్టానని, భారతదేశములో పెరిగానని భారతీయుడనని భావిస్తున్నావు, కాదు కాదు.

**ఇది నాదు మాతృదేశము**
**ఇది నా ప్రియ మాతృభాష ఇది నా మతమం**
**చెదగొట్టి నుడువనేరక**
**బ్రదికిన జీవి యొకడైన వసుధను గలడా!**

ఈ భారతీయసంస్కృతిని చాటలేనివాడు బ్రతికిన పీనుగుతో సమానమే! ఎంత గాఢమైనది, ఎంత మధురమైనది, ఎంత గంభీరమైనది, ఎంత విలువైనది, భారతీయ సంస్కృతి! ఇంత

srisathyasaivachanamrutam

గొప్ప భారతీయసంస్కృతిని యీనాడు గాలికి వదలిపెట్టాము. అందువల్లనే మానవుడు సర్వసౌఖ్యములుండినా తాను శాంతిని పొందలేకపోతున్నాడు. అన్నీ ఉన్నాయి, కానీ శాంతిలేదు. ఒకానొక సమయంలో ఈశ్వరుడు ఒక వ్యక్తిని సృష్టించి 'నాయనా! నీకు ఏమి కావాలో కోరుకో'మన్నాడు. తాను కోరినవన్నీ యిస్తానన్నాడు. ఆ వ్యక్తి 'నాకు ధనకనక వస్తువాహనాదులు అన్నీ కావాల'న్నాడు. అడిగినవన్నీ యిచ్చాడు. అనుభవించుకోమన్నాడు. అప్పుడు పక్కనే ఉన్న పార్వతి 'అన్నీ యిస్తున్నారు, భోలాశంకరుడు. ఇంక ఈ వ్యక్తి మనలను తలవనుకూడ తలవడే! అతనికి కొన్ని కట్టుబాట్లు పెడితే మంచిది' అంది. ఈశ్వరుడు చెప్పాడు: 'వారుకోరేది భౌతికమైన ధనకనకవస్తువాహనాదులు మాత్రమే! దీనికి ఏమాత్రము నేను అడ్డు తగలను. కానీ, జీవితమునకు అవసరమైనది, ప్రాణసమమైనది నా దగ్గరనే ఉంచుకున్నాను'. ఏమిటది? 'శాంతి నా దగ్గరనే పెట్టుకున్నాను', అన్నాడు.

## దుర్గుణములు మన హృదయములో ప్రవేశించకుండా చూచుకోవాలి

శాంతి లేనివానికి ఎన్ని ఉండి ఏమి ప్రయోజనము? రావణునకు కావలసినంత ధనకనకవస్తువాహనాదులున్నాయి. కోటకూడా సువర్ణముతో కట్టుకున్నాడు. గొప్ప సిరిసంపదలతో తులతూగుతున్నాడు. విద్యలు చూస్తామా 64 విద్యలు నేర్చినాడు. భుజబలము, బుద్ధిబలములలో అతనిని మించినవారు లేరు. ఇన్ని ఉండి ఏమి ప్రయోజనము? ఒక్క దుర్గుణముచేతనే శాంతిని కోల్పోయాడు. ఇంక హిరణ్యకశిపుడు చూస్తామా అంటే గొప్ప సైంటిస్టు. పంచభూతములను హస్తగతము చేసుకొని ఆడుకుంటూ కూర్చున్నాడు. చేపవలె జలములో సంచరించుటకు ప్రయత్నించాడు. రెక్కలు లేని పక్షివలె ఆకాశములో సంచరించాడు. తాను చేయలేని పని ఒక్కటీ కనిపించలేదు. ఇన్ని ఉండి ఏమి ప్రయోజనము? ద్వేషమనే పెద్ద రోగము ఉండటంచేత సర్వము కోల్పోయాడు. దుర్యోధనుడు ఎంత రాజనీతి తెలిసినవాడు! సర్వవిధముల శక్తులుంటున్నాయి. ఏమి ప్రయోజనము? అసూయ అనే దుర్గుణము ఉండటంచేత సర్వము అథః పతనమైపోయింది. దుర్గుణములు మన హృదయములో ప్రవేశించకుండా చూచుకోవాలి. ఆ దుర్గుణములు మనలో ప్రవేశించెనా అవి అన్ని విధముల మనలను దుర్మార్గములో ప్రవేశపెడతాయి. ఈనాడు విజయదశమి; అనగా పరాశక్తి రాక్షసులను సంహరించి

sri sathyasai vachanamrutam

పరిపూర్ణమైన శాంతిని దేశమునకు అందించిన దినము. దుర్గ, సరస్వతి, లక్ష్మి అన్నారు. దుర్గ ఎవరు? ఎక్కడ ఉంటున్నది? మన హృదయమే దుర్గ. ఆ దివ్యశక్తియే ఈ దుర్గాదేవి. అక్కడనుండి వస్తున్నాది, వాక్. ఆ వాక్కే సరస్వతి. హృదయము వాక్కును ఆధారము చేసుకుని చేతులతో కర్మలాచరిస్తున్నాది. ఇదే లక్ష్మి. లక్ష్మి, దుర్గ, సరస్వతులు ఎక్కడుంటున్నారు? అందరు మనయందే ఉంటున్నారు.

**సర్వశక్తులు తనయందే ఉండినప్పటికి మానవుడు శక్తిహీనుడుగా జీవిస్తున్నాడు**

నీవే దుర్గ, నీవే లక్ష్మి, నీవే సరస్వతి. అన్నీ నీలోనే ఉంచుకొని ఎక్కడో బయట వెతకటానికి పోవటం ఎంత వెఱ్ఱితనము. గాయత్రియందు 'ఓం భూర్భువస్సువః'. ఈ ముల్లోకములు మనయందే ఉంటున్నవి. దేహము ఒక లోకము. మనస్సు ఒకలోకము, ఆత్మ ఒకలోకము. యివే మూడులోకములు. భూలోకమనగా శరీరమే! ఇది ప్రకృతి అంటున్నారు. దేహమునుకూడా ప్రకృతి అంటున్నాము. ప్రకృతిలో ఏ పంచ భూతములుంటున్నాయో దేహములో ఆ పంచభూతములే ఉంటున్నాయి. కనుక దేహమే భూలోకము. మన మనస్సే భువర్లోకము. మన ఆత్మయే సువర్లోకము. ఈ మూడు లోకములు ముమ్మూర్తులుగా స్మరించినవాడు మానవుడు. అయితే సర్వశక్తులు ఉండినప్పటికి మానవుడు శక్తిహీనుడుగా జీవిస్తున్నాడు. మీరు తలచుకుంటే సాధించలేనిది ఒక్కటికూడా లేదు. చూశారా, సైంటిస్టులు లక్షలమైళ్లు అంతరిక్షయానము చేస్తున్నారు కానీ అర్థయించి హృదయాంతరాళమునకు పోవటం లేదు. బయటతిరుగుతున్నారే గానీ లోపల ప్రవేశించటంలేదు. శాంతిలోపలిదేగానీ బయటదికాదు. బయట అంతా అశాంతి, అశాంతి. శాంతి మనలో ఉంటున్నది. కనుక, లో దృష్టి మనం అభివృద్ధిపరచుకోవాలి. అప్పుడే మనకు శాంతి లభ్యమవుతుంది. మానవజన్మ ఎత్తినందుకు సార్థకమవుతుంది. ఇలాంటి సార్థకతను గావించుకునే నిమిత్తమై మానవత్వము ప్రాప్తించిందని గుర్తించాలి. ఎంతకాలమైన బాహ్యమైన ప్రజలతో బాహ్యమైన వ్రతములతో భావ్యమైన తపస్సులతో ఇది ఏమాత్రము సాధించలేము. మనము దానిని అనుభవించాలి. అనుభవించి ఆనందించాలి. ఆనందము తిరిగి పదిమందికి పంచిపెట్టాలి.

**జ్ఞానాదేవతు కైవల్యం**

ప్రతి మానవుడు చెప్పిన దానిని ఆచరణలో పెట్టాలి. ఈ ఆచరణలో పెట్టక ఎన్ని చెప్పి ప్రయోజనం ఏమిటి? ఎంత గొప్ప విద్యావంతుడైె ప్రయోజనం ఏమిటి? కనుక

**అంధకారంబెల్ల హతమారునే చూడ**
**వసుధలో దీపంపు వార్తవలన**
**ఆకొన్నవారి ఆకలి తీరునే**
**పంచభక్ష్యపు పేర్లు పరగ విన్న**
**నిరుపేదవాని పేదరికంబు పోవునే**
**విత్త ప్రభావంబు విన్నయంత**
**రోగపీడితుని బల్ రోగాలు పోవునా**
**ఔషధ మహిమము అంతవిన్న**
**శాస్త్రజాలంబునంతయు చదివినంత**
**దట్టమైనట్టి అజ్ఞాన తమము తెగున**
**ఆచరణలేని విద్యలు అవనియందు**
**దండి నేర్చిన ఫలమేమి? గుండుసున్న**

ఇవన్నీ వినటంవలన వచ్చిన ప్రయోజనము ఏమాత్రము లేదు. ఆకలి తీరాలంటే తట్టలోనున్న పదార్థము పొట్టలో చేరటానికి నోటికి, చేతికి పని పెట్టాలి. చేతితో పని చేయాలి, నోటితో అనుభవించాలి. తెలుగులో చెబుతారు. రెక్కలాడితే డొక్కలాడతాయి. మనము పనిచేయకుండా ఆహారము తినాలనుకుంటే ఎట్లా సాధ్యము అవుతుంది? నీకు అధికారములేదే! కష్టపడి పనిచేయి. అప్పుడే తినటానికి తగిన అధికారము వస్తుంది. కండలు అరిగేటట్లుగా పనిచేస్తే పండ్లు అరిగేటట్లు నీవు తినవచ్చు. కానీ ఇప్పుడు ఏమాత్రము కండరములు అరగటంలేదు. ఇంక పండ్లు ఎట్లా కదలుతాయి? రామాయణములో కబంధుడు అని ఒక రాక్షసుడు ఉన్నాడు. అతనికి తల కడుపుపైన ఉంటున్నాది. దీని అంతరార్థము ఏమిటి? నిరంతరము, సర్వకాల సర్వావస్థలందు తల

srisathyasaivachanamrutam

కడుపును మాత్రమే చింతిస్తున్నాది. కడుపు కాదు, మనకు ప్రధానము. హృదయము పవిత్రము చేసుకోవాలి. మన తలలోని జ్ఞానము మనం అభివృద్ధిపరచుకోవాలి. అదే 'జ్ఞానాదేవతుకైవల్యం'.

### ఎక్కడున్నా నామస్మరణ తప్పక ఉండాలి

విద్యార్థులాలా! మీరు అనేక విద్యలు నేర్చుకుంటున్నారు. గొప్ప డిగ్రీలు పొందుతున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. విదేశాలకు వెడుతున్నారు. యివన్నీ ఏ లక్ష్యముతో చేస్తున్నారు? మానసిక శాంతికావాలి. మానసికశాంతిలేక ఎంత ధనము సంపాయించి ప్రయోజనం ఏమిటి? ప్రయోజనం లేదు. ఈ ధనము బ్యాంకులో పెట్టవచ్చు. కానీ కట్టపడటికి నీకు ఏమీలేదు. సత్యము చక్కగా గుర్తించాలి: 'వచ్చే సమయంలో ఇంత బట్టైనా చుట్టుకొనిరారు, పోయే సమయంలో ఎడ్రెస్సు అయినా యిచ్చిపోరు'. నిజానికి పోయే ప్రతి మానవుడు పిడికెడు మట్టి తీసుకుపోతే మన భారతదేశములో మట్టికికూడా రేషను వచ్చేది. ఏదీ మన వెంటరాదు. దివ్యమైన మంచి చెడ్డలే మన వెంట వస్తాయి. కనుక, మంచి చేసి మంచి అనుభవించాలి. ఇదియే విద్యార్థులు ఈనాడు గుర్తించవలసినది. ఈ bookish knowledge వల్ల ఏమాత్రము ప్రయోజనంలేదు. ఎంతమంది చదివారు, ఎంతమంది గొప్ప గొప్ప పండితులయ్యారు, గొప్ప గొప్ప పేర్లు, బిరుదులు పొందారు! కానీ, ఏమి ప్రయోజనం? ఇంకా గొప్ప గొప్ప నోబుల్ ప్రైజులు పుచ్చుకున్న సైంటిస్టులున్నారు. కానీ, ఎవరు ఏమీ తీసుకుపోలేదు. న్యూటను భూమికి ఆకర్షణశక్తి ఉందని కనిపెట్టాడు. అతను గొప్ప సైంటిస్టే! కట్టకడపటికి ఏమై పోయాడు? తల చెడి పోయింది. 9 సం॥లు పిచ్చి హాస్పటలులో ఉండి అక్కడే మరణించాడు. ఎంత చదువులు చదివి ఏమి ప్రయోజనము?

**చదువులన్ని చదివి చాల వివేకియై**
**మగిడి తన్నెరుగడు మందమతుడు**
**ఎంత చదువు చదివి ఏరీతినున్నను**
**హీనుడవగుణంబు మానలేడు.**

srisathyasaivachanamrutam

**తరచి చదువు చదువ తర్కవాదమెగాని**
**పూర్ణజ్ఞానమెపుడు పొందలేడు**
**చదువులన్ని చదివి చావంగనేటికి**
**చావులేని చదువు చదువవలయు**

ఆ చావులేని చదువు ఒక్కటే! అదే భగవన్నామము. అట్టి నామాన్ని నీవు

**అడవులయందున్న ఆకాశముననున్న**
**పట్టణముననున్న పల్లెనున్న.....**

ఎక్కడున్నా నామస్మరణ తప్పక ఉండాలి.

**దైవానుగ్రహము కలిగినవానికి అసూయ అంతర్ధానమైపోతుంది**

విద్యార్థులారా! మీరు ఈనాడు నేర్చుకోవలసినది, మన శాస్త్రములు ప్రధానముగా బోధించినది, భగవచ్చింతనే! అట్టి చింతనచేత మన చింతలన్నీ దూరము చేసుకోవాలి. దానికంటే మించిన ఔషధము మరొకటిలేదు. మొట్టమొదట చెప్పాను, అసూయ. ఒకరికి ఉన్నాదని మనం అసూయ పడకూడదు. ఒకరి పదవి చూచి మనము అసూయ పడకూడదు. ఒకరి పేరు, ప్రతిష్ఠలు చూచి అసూయ పడకూడదు. ఒకరి కీర్తి, మర్యాదలు చూచి అసూయ పడకూడదు. ఈ అసూయ అనేది ఒక తీరని రోగము. దేహానికి కేన్సరు ఎట్లానో నీ మనసునకు అసూయ అట్టి రోగము. ఈ అసూయ అనే కేన్సరు రోగం ఎట్లా పోతుందో ఎవరికి తెలియదు. అయితే దైవానుగ్రహమును సాధించుకున్నవాడు కేన్సరును కేన్సిలు చేసుకుంటాడు. దైవానుగ్రహము కలిగినవానికి అసూయ అనేది అంతర్ధానమైపోతుంది. ఒక్క దైవప్రేమచేత తప్ప ఈ రోగము మరొక ఔషధముతో నివారణ కాదు. కనుక, దైవప్రేమను సంపాయించుకోటానికి తగిన మార్గమును వెతకాలి. అదే 'సర్వదా సర్వకాలేషు సర్వత్ర హరిచింతనం'.

**(తేదీ 21-10-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivachanamrutam